క్లుప్తంగా

దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం కట్టమంచి, దొడ్డిపల్లి ప్రాంతాల్లో మంగళవారం దాత పార్థసారథి నాయుడు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ దుప్పట్లను తహసీల్దార్ మురళీమోహన్ చేతుల మీదుగా పేదలకు అందజేశారు. పార్థసారథి నాయుడు చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీకాంత్, సహదేవన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌మూర్తి

ఐరాల: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని డీఎస్పీ శ్రీనివాస్‌మూర్తి ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. తొలుత పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్‌ఐ వెంకటేశ్వర్లును ఆదేశించారు. అలాగే పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాత్రివేళల్లో గస్తీ పటిష్టంగా నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడా పోటీలపై అవగాహన కల్పించండి



వలంటీర్లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టిన ఆడుదాం ఆంధ్రా పోటీలకు గ్రామీణ స్థాయిలో క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు యువకులు రిజిస్ట్రేషన్ చేసుకునేలా అవగాహన కల్పించాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మంగళవారం మండలంలోని ఆకనంబట్టు పంచాయతీ కార్యాలయంలో వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. 15 ఏళ్లు నిండిన యువతీ యువకులు వారి సచివాలయంలో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మాత్రమే పోటీలకు అర్హులని తెలిపారు. క్రికెట్, కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడాపోటీలు ఈ నెల 15 నుంచి 20 వరకు, ఆ తర్వాత మండల స్థాయిలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రజని, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్

యాదమరి: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్‌పై గ్రామీణులకు అవగాహన కల్పించాలని యాదమరి వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఈ యాప్‌ను ప్రజల స్మార్ట్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసి ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ఈ యాప్‌లో తెలుసుకోవచ్చని, అలాగే ఏఏ ఆసుపత్రులలో ఎలాంటి వైద్యసేవలు అందిస్తున్నారో కూడా అందులో నిక్షిప్తం చేసి ఉంటారన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవుడికి విబూది అలంకరణ



నగరి : పట్టణ పరిధిలోని శ్రీకామాక్షీ సమేత కరకంతేశ్వర ఆలయంలోని శ్రీ కాలభైరవ స్వామికి మంగళవారం అష్టమి పూజల్లో భాగంగా విబూది అలంకరణ సేవ చేపట్టారు. అలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. అష్టమి పూజలను పురస్కరించుకుని కాలభైరవ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి పాలు, పెరుగు పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. అభిషేకానంతరం పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులను అమితంగా ఆకట్టుకుంది. భక్తులు స్వామిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించండి



సవరణ జాబితాను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ చిన్నయ్య, కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: ప్రత్యేక ఓటర్ల నమోదు అవగాహన, సవరణ కార్యక్రమంలో భాగంగా అందిన ప్రతి దరఖాస్తును బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డా.జె.అరుణ స్పష్టం చేశారు. కార్పొరేషన్ పరిధిలో పీహెచ్ వాడ, మంగసముద్రం పోలింగ్ కేంద్రాల పరిధిలో జరుగుతున్న క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమాన్ని మంగళవారం ఆర్డీఓ, కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంబంధిత పోలింగ్ కేంద్రం పరిధిలో కొత్తగా ఓటు హక్కు నమోదు కోసం అందిన ఫారం–6 దరఖాస్తులతో పాటు, ఫారం–7, 8 దరఖాస్తులను సంబంధిత డోర్ నంబర్లకు వెళ్లి తనిఖీ చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు, అవగాహన కార్యక్రమంలో భాగంగా అందిన దరఖాస్తులను బీఎల్వోలు క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిశీలన చేయాలన్నారు. బీఎల్వోలు క్షేత్ర పరిశీలనను సూపర్‌వైజర్ అధికారులు కచ్చితంగా తనిఖీ చేయాలన్నారు. అనంతరం ఎలాంటి పొరబాట్లకు తావు లేకుండా అప్‌లోడ్ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలోని జీరో డోర్ నంబర్ ఓట్లు, ఒకే డోర్ నంబర్‌లో 10 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న వాటిని కచ్చితంగా ప్రత్యక్షంగా పరిశీలించి సరైన రికార్డులతో సమర్పించాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, సూపర్‌వైజర్ అధికారులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

కొత్త ఓటరుకు నాలుగు రోజులే అవకాశం

18 ఏళ్లు నిండిన యువతకు కొత్త ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం మరో నాలుగు రోజులు అంటే డిసెంబర్ 9వ తేదీ వరకు మాత్రమే ఉందని కమిషనర్ అరుణ కోరారు. కొత్త ఓటర్ల నమోదు, తప్పులు ఉంటే సరిదిద్దుకోవాలని అవగాహన కల్పించడంలో భాగంగా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్–2024లో భాగంగా జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు పూర్తయ్యే వారికి ఓటు హక్కు నమోదు కోసం ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించినట్లు వివరించారు. కొత్తగా ఓటు హక్కు నమోదు కోసం ఫారం–6 పూర్తి చేసి ధ్రువపత్రాలతో బీఎల్‌ఓకు అందించాలన్నారు.

చెరువు కాలువ ఆక్రమణ



గతంలో ఉపాధి పనులు చేసిన కాలువ (ఫైల్)



ప్రస్తుతం రాళ్లతో పూడ్చేసి ఆక్రమణకు గురైన కాలువ

గంగవరం: మండలంలోని జీడిమాకులపల్లె పంచాయతీ కొంగోళ్లపల్లెకు ఆనుకుని ఉన్న కానుగల చెరువు కాలువ ఆక్రమణకు గురైంది. గ్రామానికి తరతరాలుగా ఈ కాలువ మీదుగా ప్రవగించే నీటితోనే రైతులు పంటలు సాగు చేసేవారు. అయితే కొంతకాలానికి కాలువ మట్టితో పూడిపోవడంతో నీటి ప్రవాహం ఆగిపోవడంతో ఉపాధి హామీ పథకం కింద పూడికతీత పనులు చేయాలని గతంలో గ్రామస్తులు అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ఆరు నెలల క్రితం ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద ఉపాధి కూలీలతో పనులు చేసి దాదాపు 70 మీటర్ల పొడవు రూ.30వేలతో ఈ కాలువ పూడికతీత పనులు చేశారు. ఈ నేపథ్యంలో కానుగల చెరువుకు ఆయకట్టుగా ఉన్న కాలువను ఆ కాలువకు ఆనుకుని ఉన్న భూ యజమాని కాలువను రాళ్లతో పూడ్చేసి పూర్తిగా ఆక్రమించుకున్నట్లు రైతులు ఆరోపించారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణ నుంచి కాలువకు విముక్తి కల్పించి, పునరుద్ధరించాలని కోరారు. దీనిపై తహసీల్దార్ అమర్నాథ్ వివరణ కోరగా..కాలువ ఆక్రమణపై ఇంత వరకూ ఫిర్యాదు ఎవరూ చేయలేదని, అర్జీ ఇస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆరోగ్య సంరక్షణ కార్డుల అందజేత



పశు ఆరోగ్య కార్డులను అందజేస్తున్న డీడీ ఆసిఫ్

గుడిపాల: పాడి రైతులందరికీ పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు అందజేస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ డెప్యూటీ డైరెక్టర్ ఆసిఫ్ ఆలీస్ అన్నారు. మంగళవారం పానాటూరు పంచాయతీలో పాడి రైతులకు ఆరోగ్య సంరక్షణ కార్డులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 17 వేల పశువులు ఉన్నాయన్నారు. ఇందులో 6500 పశువులకు సంబంధించి ఆరోగ్య సంరక్షణ కార్డులను అందజేయడం జరుగుతుందన్నారు. ఇందులో పశువులకు సంబంధించిన పూర్తి వివరాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దులో చిరుత సంచారం

రామకుప్పం: ఆంధ్ర–కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో మంగళవారం రాత్రి చిరుత సంచరించినట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని వెంకటాపురం, కర్ణాటక రాష్ట్రంలోని దళవాయికొత్తపల్లె గ్రామాల మధ్య చిరుత సంచారంపై ప్రజలు సెల్‌ఫోన్లలో తీశారు. కర్ణాటక అటవీ అధికారులు చిరుతను బంధించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతం నుంచి ఆంధ్రలోని గ్రామాల వైపు చిరుత వస్తుందన్న భయంతో ప్రజలు హడలిపోతున్నారు.



రోడ్డుపై సంచరిస్తున్న చిరుత

నాదనీరాజనంపై అయోధ్యకాండ పారాయణం

తిరుమల: తెల్లని పొగమంచు తెరల నడుమ, శేషగిరులే హిమగిరులను తలపిస్తున్నాయి. ఈ తరుణంలో లోక కల్యాణార్థం శ్రీవారిని ప్రార్థిస్తూ నాదనీరాజనం వేదికపై మంగళవారం ఉదయం 7 నుండి 9 గంటల వరకు 5వ విడత అయోధ్య కాండ అఖండ పారాయణంతో తిరుమలగిరులు మార్మోగాయి. 14 నుండి 17వ సర్గల వరకు గల 186 శ్లోకాలను పారాయణం చేశారు. వేద పండితులు అఖండ పారాయణం చేయగా పలువురు భక్తులు భక్తిభావంతో వారిని అనుసరించి శ్లోక పారాయణం చేశారు. ధర్మగిరి వేద విజ్ఞానపీఠానికి చెందిన ప్రముఖ పండితులు రామానుజాచార్యులు, అనంత వేణుగోపాల్ మారుతి శ్లోక పారాయణం చేశారు. అఖండ పారాయణంలో ధర్మగిరి వేద పాఠశాల, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేద అధ్యాయన సంస్థకు చెందిన వేద పారాయణదారులు, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన పండితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు మధుసూదన నామ సంకీర్తన చివరిలో ఆలపించారు.

వెటర్నరీ వర్సిటీతో కలసి పనిచేస్తాం

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీతో పరిశోధన అంశాలపై స్విమ్స్ కలసి పనిచేస్తుందని డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. మంగళవారం ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీలో పశు శరీర నిర్మాణ శాస్త్రంపై ప్రారంభమైన మూడు రోజుల జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ మానవ సంరక్షణలో భాగంగా తయారు చేసే పరిశోధక మెడిసిన్ సామర్థ్యాన్ని పరీక్షించేందుకు వెటర్నరీ కళాశాల సహాయ సహకారాలు తీసుకుంటామన్నారు. మొదటి రోజు సదస్సులో గ్రాస్ అనాటమీ, అనాటమీ ఆఫ్ జూ అండ్ వైల్డ్ ఆనిమల్స్ అంశాలపై సదస్సులో చర్చించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య, వెటర్నరీ డీన్ ప్రొఫెసర్ కే వీరబ్రహ్మయ్య, పుదుచ్చేరి పశు వైద్య కళాశాల ప్రొఫెసర్ తాండవమూర్తి, శాస్త్రవేత్తలు హాజరయ్యారు.

అమ్మవారి సేవలో ఉడిపి పీఠాధిపతి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని మంగళవారం ఉడిపి శ్రీపాదురు బండారుకేరి మఠాధిపతి శ్రీవిదీషతీర్థ స్వామీజీ తన శిష్య బృందంతో కలసి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తి దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వదించారు.




అమ్మవారి సేవలో ఉడిపి శ్రీపాదురు బండారుకేరి మఠాధిపతి శ్రీవిదీషతీర్థ స్వామీజీ

కనువిందు చేస్తున్న తలకోన జలపాతం

భాకరాపేట: ఎర్రావారిపాళెం మండలం తలకోనలోని జలపాతం కనువిందు చేస్తోంది. సోమవారం తలకోన జలపాతం దృశ్యాలు చూడడానికి పెద్ద ఎత్తున సందర్శకులు వచ్చారు. తలకోన అటవీ ప్రాంతంలో వర్షాలు పడడంతో శిరోద్రోణం జలపాతం కింద కనీసం నిలబడలేని పరిస్థితి. నెలకోనలోని జలపాతం మడుగు నిండి పొర్లుతోంది. ప్రవాహం ఎక్కువగా ఉండడంతో అటవీ శాఖ అధికారులు సందర్శకులను జలపాతం వద్దకు అనుమతించకుండా చర్యలు తీసుకున్నారు.





తలకోన జలపాతం (శిరోద్రోణం)

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



ప్రత్యేక ప్రతిభావంతులకు బహుమతులు ఇస్తున్న ఎంఈఓ రుక్మిణి

యాదమరి: స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ శివరాజ్, ఎంఈఓ రుక్మిణి ముఖ్యఅతిథులుగా మాట్లాడారు. అంగవైకల్యం అనేది మనసుకు కాదని, అవయవాలకు మాత్రమేనన్నారు. ప్రత్యేక ప్రతిభావంతులను వివక్షతో చూడరాదన్నారు. అనంతరం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 ప్రసాద్, ఐఈ డీఎస్ఎస్ మధు, ఐఈఆర్పీ ఉమ ఉపాధ్యాయులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కుల గణనపై సమావేశం

బంగారుపాళెం: కుల గణనపై బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు తమ కార్యాలయ సమావేశ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, మైనారిటీ అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు హాజరు కావాలని కోరారు.

నేలకొరిగిన వరి పైరు

పూతలపట్టు: తుపాను ప్రభావం మూలాన కురిసిన వర్షం, పెనుగాలులకు మండలంలోని గాండ్లపల్లె, తేనేపల్లి పంచాయతీలోని గ్రామాల్లో కోతకొచ్చిన వరి పైరు నేలకొరిగింది. తుంబవారిపల్లెకు చెందిన రైతు కృష్ణారెడ్డి 3 ఎకరాలలో సాగు చేసిన పంటలో వర్షపు నీరు చేరింది. మండల వ్యవసాయాధికారిణి మధురవాణి మంగళవారం బాధిత రైతు పొలాన్ని పరిశీలించారు. నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆమె చెప్పారు. అలాగే, తేనేపల్లె పంచాయతీలో కూడా వరి పంటల్లో ఇదే పరిస్థితి కనిపించింది.



నీళ్లు చేరిన వరి పంటను చూపిస్తున్న రైతు, పక్కన మండల వ్యవసాయాధికారిణి



తవణంపల్లె : కె.పట్నంలో..



తవణంపల్లె : చెర్లోపల్లెలో..

ఇంటి వద్దకే వైద్యం

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామీణ ప్రజలకు ఇంటి వద్దకే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గుండ్లపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ 104 వాహనంలో 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు–సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, పీహెచ్ఎన జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో 'ఫ్యామిలీ డాక్టర్'

తవణంపల్లె: గ్రామీణ ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య సేవలు పొందాలని తవణంపల్లె వైద్యాధికారులు డాక్టర్ ధాత్రేయచౌదరి, డాక్టర్ మోహన్‌వేలు కోరారు. మంగళవారం మండలంలోని చెర్లోపల్లె, కె.పట్నం గ్రామాల్లో వైద్యాధికారులు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కె.పట్నంలో డాక్టర్ ధాత్రేయచౌదరి రోగులకు, గర్భవతులకు, బీపీ, మధుమేహం వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే చెర్లోపల్లెలో డాక్టర్ మోహన్‌వేలు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. గర్భవతులు ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



ఐరాల : వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

డ్రోన్లతో పురుగు మందుల పిచికారీ

గుడిపాల: డ్రోన్‌ల ద్వారా సులువుగా పురుగు మందులు పిచికారీ చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర, ప్రపంచ నేలదినోత్సవం సందర్భంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసారాన్ని, భూ ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలి ? డ్రోన్‌ల ద్వారా పురుగుమందులు పిచికారీ ఎలా చేయాలనే దానిపై వివరించారు. అనంతరం గుడిపాల రైతుభరోసా కేంద్రంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈక్రాప్ నమోదు వేగవంతం చేయాలని, అన్ని విధాలా రైతులకు సహాయ సహకారాలు అందజేయాలని సూచించారు. పంటల సాగుపై రైతులతో సమావేశాలు నిర్వహించి వారికి అందుబాటులో ఉండాలన్నారు. యూరియా, డీఏపీలు ఎప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరులకేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు నాగమణి, పద్మిణి, ఏఓ మాధవి పాల్గొన్నారు.



గుడిపాల: సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



వైద్యసేవలు అందజేస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గుడిపాల ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి సంధ్య తెలిపారు. మంగళవారం గుడిపాల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వ్యాధులు ప్రబలిస్తున్నాయని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం 55 మంది గర్భిణులు, బాలింతలు, షుగర్ వ్యాధిగ్రస్తులకు చికిత్స చేసి ఉచితంగా మందులు, మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది చంద్ర, సోనియా, లత, సింధుజ పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుపై డోర్ టు డోర్ సర్వే

పూతలపట్టు: మండలంలోని బీఎల్వోలు తప్పనిసరిగా వారికి కేటాయించిన పోలింగ్ బూత్ పరిధిలో డోర్ టు డోర్ సర్వే చేయాలని ఈఆర్వో శివయ్య ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలు, అధికారులతో ఆయన సమీక్షించారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. ఫారం 6, 7, 8లలో జాగ్రత్త వహించాలన్నారు. అనుమానాలు ఉన్నపక్షంలో ఎలక్షన్ అధికారులతో నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్, డీటీలు మహేశ్వరి, హిమగిరి, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో శివయ్య